సాక్షి
ఒడిశా
మంగళవారం । 30 । సెప్టెంబర్ । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,77,321లు, బంగారం 440 మిల్లీగ్రాములు, వెండి 56గ్రాముల 600 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



కత్తి డాలు తరలింపు

పర్లాకిమిడి కోటలోనికి కత్తి, డాలు తరలించారు. జనం వీక్షించారు.

- 8లో



నాలుగు ప్రతిపాదనలకు..

నాలుగు ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం లభించింది. పని గంటలు పెరుగాయి.

- 8లో

న్యూస్‌రీల్

9 నాగుపాములు, కొండచిలువ పట్టివేత



సీసాల్లో బంధించిన పాములు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలోని ఎం.వి.8 గ్రామంలో సోమవారం తొమ్మిది నాగుపాములు, ఒక కొండచిలువను జిల్లా స్నేక్ హెల్ప్‌లైన్ సభ్యుడు శరత్ మాఝి పట్టుకున్నారు. కొద్దిరోజులుగా గ్రామంలో పాములు సంచరిస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు అటవీశాఖ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. చీకటి పడితే బయట తిరగలేక పోతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో అధికారులు స్పందించి పాములను పట్టించారు. సీసాల్లో బంధించిన పాములను ఎంవీ 11 గ్రామ అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు.

వంతెన కూలి రాకపోకలకు అంతరాయం



కూలిన వంతెన

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ సమితి ఆంధ్రాపల్లి-పనాస్‌పూట్ పంచాయతీల ప్రధాన రహదారిపై ఉన్న వంతెన జిల్లాలో కురుస్తున్న వర్షాలకు కూలిపోయింది. దీంతో రెండు గిరిజన గ్రామ పంచాయతీలకు రాకపోకలు నిలిచిపోయాయి. వంతెనను నాసిరకంగా నిర్మించడంతోనే కూలిపోయిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి కూలిన వంతెనను నిర్మించి కష్టాలు తీర్చాలని కోరుతున్నారు

విద్యుత్ విభాగ కార్యాలయం ముట్టడి



విద్యుత్ విభాగ కార్యాలయాన్ని ముట్టడించిన ప్రజలు

జయపురం: గత పది దినాలుగా తమ గ్రామానికి విద్యుత్ సరఫరా లేక అంధకారంలో మగ్గుతున్నామని జయపురం సమితి బొయిపరిగుడ సమితి బొదాగుడ పంచాయతీ మాలిగుడ ప్రజలు సోమవారం విద్యుత్ కార్యాలయాన్ని ముట్టడించారు. బొయిపరిగుడలో గల విద్యుత్ విభాగ కార్యాలయాన్ని ముట్టడించిన గ్రామస్తులు తమ గ్రామానికి గత వారం రోజులుగా విద్యుత్ సరఫరా లేదని, ఈ విషయం సంబంధిత అధికారులకు ఎన్ని పర్యాయాలు తెలిపినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పిల్లల చదువులకు కూడా ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. పోలీసులు వచ్చి సమాధాన పరచడంతో శాంతించారు.

ఘనంగా విశ్రాంత ఉద్యోగుల సంఘం వార్షికోత్సవం



డబ్బీరు భాగ్యలక్ష్మిని సన్మానిస్తున్న సంఘం సభ్యులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలోని ఎక్స్‌బోర్డ్ పాఠశాలలో సోమవారం విశ్రాంత ఉద్యోగుల సంఘం 14వ వార్షికోత్సవం సందర్భంగా సన్మాన సభ ఏర్పాటు చేశారు. సంఘ అధ్యక్షుడు ప్రకాష్ చంద్ర పట్నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక సభ్యుల కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించారు. సత్కారం అందుకున్న వారిలో డబ్బీరు కేశవరావు భార్య డబ్బీరు భాగ్యలక్ష్మి, సింగమహంతి రామచంద్ర పట్నాయిక్ కుమారుడు ఎస్.దుర్గా పట్నాయక్ ఉన్నారు. వీరితో పాటు రిటైర్డ్ ఉద్యోగులు ప్రకాష్ పట్నాయక్, దుర్యోధన్ పాత్రో, నారాయణ్‌దాస్ తదితరులను సన్మానించారు.

శరన్నవరాత్రి కళ



పర్లాకిమిడి: రాయగడ సర్కిల్‌లో..



రాయగడ: కుంకుమ పూజల్లో మహిళలు



రాయగడ: పిల్లలకు అక్షరాభ్యాసం చేస్తున్న దృశ్యం



జయపురం: కులదైవానికి పూజలు చేస్తున్న యువరాజు విశ్వేశ్వర చంద్ర చూడ్ దేవ్



జయపురం: రాజ దర్బార్

పర్లాకిమిడి:

పట్టణంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉప్పలాడ, రాణిపేట రోడ్డులో 132/33 కె.వీ లైను, గజపతి స్టేడియం వద్ద రాయగడ సర్కిల్ విద్యుత్ కేవీ లైన్ ఘనంగా నిర్వహిస్తున్నారు. అష్టమి నుంచి విజయ దశమి వరకూ జరిగే శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అనేక మంది ప్రజలు సాయంత్రం పూట అమ్మవారిని దర్శించుకుంటున్నారు.

రాయగడ: దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా సోమవారం స్థానిక అటానమస్ కళాశాల, ఎస్‌బీఐ కూడలి, పోలీస్ మండపాల్లో అమ్మవార్లు కొలువుదీరారు. ఈ సందర్భంగా ఆవాహన, షోడోపచార, హోమం తదితర పూజల అనంతరం ప్రాణప్రతిష్ఠ చేశారు. రాణిగుడఫారం వద్ద అమ్మవారి సన్నిధిలో కుంకుమ పూజలు జరిగాయి.

సరస్వతీ దేవిగా..

రాయగడ: దసర శరన్నవరాత్రుల్లో భాగంగా సోమవారం స్థానిక కస్తూరీ నగర్‌లో గల శ్రీసత్యనారాయణ స్వామి ఆలయంలో లక్ష్మీ అమ్మవారిని సరస్వతీ దేవిగా అలంకరించారు. ఆలయ అర్చకులు మావుడూరు కిశోర్ ఆధ్వర్యంలో పిల్లలు అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొన్నారు. బాలాజీ నగర్‌లో గల కల్యాణ వేంకటేశ్వర ఆలయంలో కొలువై ఉన్న రాజ్యలక్ష్మి దేవిని సరస్వతీ రూపంలో అలంకరించి ఆలయ ప్రధాన అర్చకులు భాస్కరాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రాజసౌధంలో..

జయపురం: దసరా సందర్భంగా జయపురం రాజ సౌధాలు ధగధగా మెరిసిపోతున్నాయి. రాజ కోటలో గల రాజుల కులదైవం కనక దుర్గా దేవిని దర్శించేందుకు, అందంగా తీర్చి దిద్దిన రాజ సౌధాలను ప్రజలు తిలకించేందుకు రాజ కోట ప్రధాన ద్వారాన్ని తెరిచి ఉంచారు. జయపురం యువరాజు విశ్వేశ్వర చంద్ర చూడ్ దేవ్ తమ కులదైవం కనక దుర్గా దేవికి ఆదివారం సాయంత్రం శాస్త్రోక్తంగా పూజలు చేశారు.



హైస్కూల్ జంక్షన్ వద్ద మోటారు ఫీల్డు వర్కర్స్ సంఘాల ఆధ్వర్యంలో దుర్గాదేవి వేడుకలు



రాయగడ: పోలీసు మండపంలో కొలువుదీరిన దుర్గమ్మ



పర్లాకిమిడి: రాణిపేట రోడ్డులో 132 కేవీ లైను స్టేషన్ వద్ద దుర్గాదేవి వేడుకలు



కస్తూరీ నగర్‌లో సరస్వతి రూపంలో లక్ష్మీ అమ్మవారు



జయపురం: రాజుల కులదైవం కనకదుర్గ మందిరం



జయపురం: అందమైన రాజ దర్బార్ హాలు

అదరగొట్టిన గజపతి విద్యార్థులు



పూజా సామల్



అభియం మండళ్



సబ్యసాచి పట్నాయిక్



ప్రజుక్తా శోబోరో



దీప్తిరాణి నాయక్

పర్లాకిమిడి: ఒడిషా సివిల్ సర్వీసు పరీక్షా ఫలితాల్లో గజపతి జిల్లా నుంచి ఐదుగురు ఎంపికయ్యారు. ఒడిషా సివిల్ సర్వీసు కమిషన్ (ఓ.పి.యస్.సీ.) ఫలితాల్లో ప్రజుక్తా శోబోరో, దీప్తి రాణి నాయక్, అభియం మండళ్, పూజా సామల్, సభ్యసాచి పటాన్నాయిక్ విజయం సాధించారు. పర్లాకిమిడి కరణం వీధికి చెందిన సభ్యసాచి పట్నాయిక్ సెంచూరియన్ వర్సిటీలో ఎం.ఎస్సీ(అగ్రికల్చర్) చదివి పీహెచ్‌డీ చేస్తున్నాడు. వరుసగా మూడుసార్లు ఓఏఎస్ పరీక్ష రాసిన తర్వాత పాసయ్యాడు. అలాగే పూజా సామల్ స్వగ్రామం గుసాని సమితి గురండి. భుభనేశ్వర్‌లో ఒడిషా కృషి విశ్వవిద్యాలయంలో పట్టభద్రురాలైంది. ప్రజుక్తా శోబోరో కూడా గుసాని సమితి ఎస్.రాతుపురం గ్రామం. అభియం మండళ్ రాయగడ బ్లాక్ తలముండ గ్రామం కాగా దీప్తిరాణి నాయక్‌ది రాయఘడ బ్లాక్ మురేయి సాహి గ్రామం.

సికరపాయిలో ఏనుగుల సంచారం



సికిరపాయి అడవుల్లో కనిపించిన ఏనుగు



అడవుల్లో పిల్ల ఏనుగు

రాయగడ : జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి సికరపాయి అటవీ ప్రాంతాల్లో ఏనుగులు సంచరిస్తున్నాయి. ఈ విషయాన్ని అటవీ శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై ఆరా తీసేందుకు ఆయా ప్రాంతాలకు వెళ్లి పరిశీలించిన సంబంధిత శాఖ సిబ్బంది ఒక తల్లి ఏనుగు మరో పిల్ల ఏనుగు ఇక్కడ సంచరిస్తున్నట్లు గుర్తించారు. పంచాయతీలోని ఉపారొసాజ, తొలొసాజ మీదుగా నాగావళి నదీ తీర ప్రాంతాల్లో ఇవి సంచరిస్తున్నాయి.

శ్రీ మందిరం శిఖరాన డ్రోన్ చక్కర్లు

భువనేశ్వర్: పూరీ శ్రీ జగన్నాథుని మందిరం భద్రతా సర్వత్రా ఆందోళనకరంగా మారుతోంది. శ్రీ మందిరం ప్రాంగణం నో ఫ్లయింగ్ జోన్. ఈ పరిసరాల్లో డ్రోన్ వ్యతిరేక వ్యవస్థ పని చేస్తుందని జిల్లా భద్రత, రక్షణ వర్గాలు తరచూ ప్రకటిస్తున్నాయి. ఈ ప్రకటనలు ఇలా ఉండగా ఎప్పటికప్పుడు శ్రీ మందిరం శిఖరంపై డ్రోన్‌లు చక్కర్లు కొడుతూ భద్రతా వ్యవస్థకు సవాలు విసురుతున్నాయి. ఇలాంటి సంఘటన ఆదివారం రాత్రి పునరావృతమైంది. దాదాపు పావు గంట (15 నిమిషాలలు) పాటు ఆలయ శిఖరంపై డ్రోన్ చక్కర్లు కొట్టిన దృశ్యం దృష్టికి వచ్చింది. శ్రీ మందిరం ప్రాకారం లోపల ఆనంద్ బజార్, స్నాన మండపం ప్రాంగణాల మీదుగా డ్రోన్ సంచారం కలవరపరిచింది. డ్రోన్ ఎక్కడి నుంచి నియంత్రిస్తున్నారో స్పష్టం కాలేదు. ఇటీవల జరుగుతున్న సంఘటనల నేపథ్యంలో సాధారణంగా వారాంతంలో నో-ఫ్లై జోన్‌లో తరచుగా డ్రోన్‌లు, విమానాల సంచారం తారసపడుతోంది.



శ్రీ మందిరం శిఖరాన చక్కర్లు కొడుతున్న డ్రోన్

రమేశ్ హాల్బాకు ఘనంగా నివాళి



రమేశ హాల్బా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సీఆర్పీఎఫ్ కమాండర్ రాజీవ్ కుమార్

మల్కన్‌గిరి : మల్కన్‌గిరి జిల్లాకు చెందిన వీర జవాన్ రమేశ్ హాల్బా స్మృతి దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు . జిల్లాకు చెందిన రమేశ్ హాల్బా 2007లో సీఆర్‌పీఎఫ్‌లో సిపాయిగా చేరి 2009లో జమ్మూ కశ్మీర్‌లో విధులు నిర్వహిస్తున్న సమయంలో ఉగ్రవాదుల కాల్పుల్లో 29/9/2009 లో వీర మరణం పొందారు. 16వ వర్ధంతి సందర్భంగా స్థానిక ఉన్నత పాఠశాలలోని ఆయన విగ్రహం వద్ద సోమవారం స్మృతి దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నవరంగ్‌పూర్ 12 వ బెటాలియన్ సీఆర్‌పీఎఫ్ కమాండర్ రాజీవ్ కుమార్ వచ్చి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్‌గా శిరీష్ చంద్ర ముర్ము

భువనేశ్వర్: శిరీష్ చంద్ర ముర్ము భారత రిజర్వ్ బ్యాంకు డిప్యూటీ గవర్నర్‌గా నియమితులయ్యారు. క్యాబినెట్ నియామకాల కమిటీ ఆమోదంతో నియమితులైన శిరీష్ చంద్ర ముర్ము మూడేళ్ల పాటు ఈ హోదాలో బాధ్యతలు నిర్వహిస్తారు. ఈ ఏడాది అక్టోబర్ 9న ఆయన బాధ్యతలు స్వీకరిస్తారు. ఆర్‌బీఐ కార్య నిర్వాహక డైరెక్టర్‌గా ఆయనకు సుదీర్ఘ అనుభవం ఉంది. రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరి బాబు కంభంపాటి, ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ శిరీష్ చంద్ర ముర్మును అభినందించారు. తన నిరూపితమైన అనుభవం, నాయకత్వంతో భారతదేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తారని గవర్నర్ ఆకాంక్షించారు.



శిరీష్ చంద్ర ముర్ము

ఈబ్ నదిలో పడిన ట్రక్కు



సుందర్‌గఢ్ జిల్లా భస్మా - రెముండా వంతెనపై ట్రక్కు అదుపు తప్పి ఈబ్ నదిలో పడింది. డ్రైవర్ జాడ తెలియకపోవడం కలకలం రేపింది. పోలీసులు ఘటనా స్థలం సందర్శించి పర్యవేక్షిస్తున్నారు.

భువనేశ్వర్

సరస్వతీదేవి అవతారంలో దుర్గాదేవి దర్శనం



రాయగడ: సరస్వతీదేవి అవతారంలో కన్యకాపరమేశ్వరీ అమ్మవారు

పర్లాకిమిడి పట్టణంలో వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో శరన్నవరాత్రులు సందర్భంగా సోమవారం అమ్మవారు సరస్వతీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధాన పూజారి వనమాలి మణిశర్మ ఆధ్వర్యంలో వందమంది బాలబాలికలచే లక్షపసుపు కొమ్ములతో అమ్మవారికి పూజలు చేయించారు. పలువురు చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. విజయదశమి వరకూ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో ప్రత్యేక పూజలు జరగనున్నాయి.

-పర్లాకిమిడి



బాలబాలికల లక్ష పసుపు కొమ్ముల పూజలు



చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న పూజారి



చిన్నారులచే అమ్మవారికి లక్షపసుపు కొమ్ముల పూజలు

క్లుప్తంగా

ఇంటిపై కూలిన భారీ వృక్షం



ఇంటిపై కూలిన చెట్టును తొలగిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా మత్తిలి సమితి మెక్కా పంచాయతీ మర్మూరిగూడ గ్రామంలో సోమవారం ఓ భారీ వృక్షం ఇంటిపై కూలిపోయింది. విజయ్ పట్నాయక్ కుటుంబ సభ్యులతో ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో వేకువజామున భారీవర్షం కారణంగా పక్కనే ఉన్న చెట్టు కూలిపోయింది. సోమవారం ఉదయం మత్తిలి అగ్నిమాపక సిబ్బందికి చేరడంతో వారువచ్చిన చెట్టును తొలగించారు. అలానే సమీపంలో అంగన్‌వాడీ కేంద్రంపై కూడా మరో చెట్టు పడడంతో దాని కూడా తొలగించారు.

కళింగ వైశ్య సంఘం ఆధ్వర్యంలో వైద్య శిబిరం



వైద్య పరీక్షలను నిర్వహిస్తున్న దృశ్యం

రాయగడ: స్థానిక కళింగ వైశ్య సంఘం ఆధ్వర్యంలో సోమవారం సంఘం కార్యాలయం భవనంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. విశాఖపట్నానికి చెందిన ఇండస్ ఆస్పత్రి సౌజన్యంతో నిర్వహించిన శిబిరంలో వైద్యులు హృద్రోగ, ఆర్థో పరీక్షలను వైద్య నిపుణులు హాజరయ్యారు. 80 మంది హృద్రోగ, 40 మందికి ఆర్థో పరీక్షలను చేపట్టారు. సంఘం అధ్యక్షులు కింతలి అమర్‌నాథ్, కార్యదర్శి టి. జయరాం, కోశాధికారి వి.మురళి, సభ్యుల పర్యవేక్షణలో శిబిరం జరిగింది. సేవా కార్యక్రమాల్లో భాగంగా తమ సంఘం వైద్య శిబిరాన్ని నిర్వహించామని.. రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నామని అధ్యక్షులు అమర్‌నాథ్ తెలిపారు.

మలేషియాలో ఉత్తరాంధ్ర జానపద కళారూపాలు

పలాస: మలేషియాలో నివసిస్తున్న తెలుగు ప్రజలకు చెక్కభజన, కోలాటం, తదితర జానపద కళారూపాల్లో శిక్షణ ఇచ్చే అవకాశం ఉత్తరాంధ్ర జానపద కళాకారులకు దక్కడం గొప్ప విషయమని పలాస మండలం రంగోయి గిడుగురామ్మూర్తి తెలుగు భాషా జానపద కళాపీఠం వ్యవస్థాపకుడు బద్రి కూర్మారావు చెప్పారు. కళాపీఠం సభ్యులు తవిటినాయుడు, సాయికుమార్‌లు మలేషియాలో నెల రోజుల పాటు అక్కడి తెలుగువారికి జానపద కళల్లో శిక్షణ ఇస్తున్నారని తెలిపారు.

స్తంభాన్ని ఢీకొట్టి యువకుడు మృతి

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని ఆర్ట్స్ కళాశాల సమీప వాటర్‌ట్యాంక్ వద్ద విద్యుత్తు స్తంభాన్ని ద్విచక్రవాహనంపై వస్తున్న ఓ యువకుడు ఢీకొట్టాడు. ఈ నెల 27న జరిగిన ఈ ప్రమాదంలో విశాఖపట్నం హనుమంతువాకకు చెందిన కొత్తలంక పూర్ణచంద్రరావు తీవ్రంగా గాయపడి ఆదివారం రాత్రి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ట్రాఫిక్ పోలీసులు సోమవారం వెల్లడించారు.

వివాహమై మూడు నెలలే..

శ్రీకాకుళం రిమ్స్ ప్రభుత్వాసుపత్రిలో పరిపాలనావిభాగంలో కార్యాలయ అసిస్టెంట్‌గా ఉన్న పూర్ణచంద్రరావుకు విశాఖ యువతి పావనితో మూడు నెలల కిందట వివాహమైంది. పూర్ణచంద్రరావు కారుణ్య నియామకంలో రిమ్స్‌లో ఉద్యోగానికి ఎంపికయ్యాడు. శనివారం రిమ్స్‌లో గాయాలతో పూర్ణచంద్రరావు చేరినా అక్కడి సిబ్బంది ఎందుకో గోప్యంగా ఉంచారని భార్య పావని చెప్పినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుధాకర్ వెల్లడించారు.

పిడుగుపాటుకు వ్యక్తి మృతి

కొత్తూరు: సిరుసువాడ గ్రామానికి చెందిన కోటిలింగాల హరిచంద్ర (55) పిడుగుపాటుకు గురై మృతి చెందాడు. సోమవారం సాయంత్రం ఉరుములు మెరుపులతో గంట పాటు భారీ వర్షం కురిసింది. ఇంటి పెరటిలో ఉన్న కొబ్బరి చెట్టుపై పిడుగు పడింది. అదే సమయములో ఇంట్లో కుటుంబ సభ్యులతో ఉన్న హరిచంద్ర పిడుగు ధాటికి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే కొత్తూరు సీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతి చెందాడు. హరిచంద్రకు భార్య అనసూయ, ముగ్గురు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు.



మాణికేశ్వరీ మందిరం నుంచి అమ్మవారి కత్తి, డాలును కోటకు తీసుకెళ్తుతున్న పరివారం



గజపతిరాజుల ఇలవేల్పు కనకదుర్గ



పూజానంతరం కోటనుంచి కత్తి, డాలును తీసుకువస్తున్న పూజారి



గజపతిరాజుల కోట బయట పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

కత్తి, డాలు కోటలోకి తరలింపు

పర్లాకిమిడి: పట్టణంలోని అంకావీధిలో గల గజపతుల ఇలవేల్పు మాణికేశ్వరీ దేవికి గత 16 రోజులపాటు నిర్వహించిన దసరా వేడుకలు మూలష్టమి అయిన సోమవారంతో ముగిశాయి. గజపతుల వంశీయులు కళ్యాణి గజపతి లేకపోవడంతో రాజమందిరంలో సేవకులు, ప్రధాన అర్చకులు మేళతాళలతో అంకావీధిలోని మాణికేశ్వరీదేవి మందిరానికి వచ్చి పార్శ్వభాగంలో ఉన్న కనకదుర్గ కత్తి, డాలును ప్రధాన పూజారి రఘుపాత్రో తీసుకుని కోటలోకి వెళ్లి శాస్త్రీయంగా పూజలు జరిపారు. తిరిగి అమ్మవారి కత్తి, డాలును మాణికేశ్వర మందిరంలో యథాస్థానంలో పెట్టారు. ఈ రాత్రికి అమ్మవారికి కోడిపుంజును బలిచేసి నైవేద్యం పెడతారు. ఆనాదిగా వస్తున్న ఈ ఆచారాన్ని గత వందేళ్లకు పైగా నిర్వహిస్తున్నారు. పర్లాకిమిడిలో ఈ ఒక్క మాణికేశ్వర మందిరంలో మార్పులు (చేపలు), నీసు వంట అమ్మవారికి నైవేద్యంగా పెట్టడం ఆనవాయితీ. వచ్చే విజయదశమి వరకు కనకదుర్గ, అమ్మవారికి పూజలు మాత్రం యథావిధిగా నిర్వహిస్తారు.

నాలుగు ప్రతిపాదనలకు.. మంత్రివర్గం ఆమోదం

- ఉద్యోగులకు వారానికి 10 గంటలు పని
- ఓవర్ టైమ్‌కు రెట్టింపు జీతం

భువనేశ్వర్:

ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ అధ్యక్షతన లోక్ సేవా భవన్ సమావేశం హాల్‌లో సోమవారం మంత్రివర్గం సమావేశమైంది. మూడు విభాగాలకు సంబంధించి నాలుగు ప్రతిపాదనలపై మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రజాపనుల శాఖ, పాఠశాలలు– సామూహిక విద్యాశాఖ నుంచి ఒక్కోటి చొప్పున, కార్మిక–ఉద్యోగుల రాష్ట్ర బీమా పథకం శాఖ నుంచి 2 చొప్పున మొత్తం నాలుగు ప్రతిపాదనలు ఆమోదం పొందాయి.

కార్మిక చట్టాల సవరణలు, కొత్త విద్యా పథకం, కెంజొహర్ జిల్లా ఘుటొగాంవ్ తరిణి పీఠం సమగ్ర అభివృద్ధి ప్రణాళిక ఉన్నాయి. ఒడిశా దుకాణాలు, వాణిజ్య సంస్థల చట్టం, 1956 కార్ఖానాల చట్టం, 1948 సవరణలను మంత్రి మండలి ఆమోదించింది. దీనిప్రకారం రోజువారీ పని గంటలను తొమ్మిది నుంచి 10 గంటలకు పెంచారు. వారం రోజుల గరిష్ట పరిమితి 48 గంటలుగానే కొనసాగుతుందని ప్రకటించారు. తాజా సవరణల ప్రకారం నిర్ధారిత పరిమితికి మించి పనిచేసే ఉద్యోగులకు ఓవర్ టైమ్ వేతనాలు లభిస్తాయని ముఖ్యమంత్రితెలిపారు.

మహిళా ఉద్యోగులు రాత్రి పూట విధుల్లో పాల్గొనేందుకు వీలు కల్పించే మైలురాయి నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకుంది. వారు లిఖితపూర్వక అనుమతిని సమర్పిస్తే, వారి భద్రతను నిర్ధారించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని మంత్రివర్గం అభయం ఇచ్చింది. 'ఒడిశాలో కార్మిక సంక్షేమం, విద్యా మౌలిక సదుపాయాలు, మతపరమైన పర్యాటకాన్ని బలోపేతం చేయడంలో ఈ నాలుగు ప్రతిపాదనలు ప్రాధాన్యత సంతరించుకుని దైనందిన జీవనంలో అనేక మంది ప్రజల శ్రేయస్సును నిర్ధారిస్తాయని ముఖ్యమంత్రి అన్నారు.



సమావేశంలో పాల్గొన్న ముఖ్యమంత్రి, మంత్రులు

కార్మిక చట్టాల సవరణలు..

మంత్రివర్గం తాజా నిర్ణయం మేరకు ఇక నుంచి 20 లేదా అంతకంటే ఎక్కువ మంది కార్మికులను నియమించే సంస్థలకు ఎంప్లాయీ స్టేట్ ఇన్సూరెన్స్ (ఈఎస్ఐ) చట్టం– 1948 సవరణలు వర్తిస్తాయి.

గోదాబరీష్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల పథకం ఆమోదం..

విద్యా హక్కు చట్టం, 2009కి అనుగుణంగా విద్యా రంగంలో ప్రాథమిక విద్యను బలోపేతం చేయడానికి గోదాబరీష్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల పథకాన్ని మంత్రివర్గం ఆమోదించింది. ప్రతి పంచాయతీలో కనీసం ఒక ఆదర్శ ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేయడం ఈ ప్రణాళిక లక్ష్యం. అంచెలంచెలుగా ఈ నిర్ణయం వాస్తవ కార్యాచరణకు మార్గదర్శకాల్ని మంత్రివర్గం ఖరారు చేసింది. తొలి దశలో రాగల 3 సంవత్సరాల్లో రూ.1,200 కోట్ల అంచనా వ్యయంతో 2,200 ఆదర్శ పాఠశాలలను నిర్మిస్తారు. ప్రతి పాఠశాలకు రూ.5 కోట్లకు పైగా నిధులు మంజూరవుతాయి. తొలి దశ పూర్తి కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పంచాయతీలకు ఈ పథకం కార్యాచరణ విస్తరిస్తారు.

తరణి మాత ఆలయం అభివృద్ధి..

కెంజొహర్ జిల్లా ఘుటొగాంవ్ తరిణి మాత ఆలయం పార్శ్వ ప్రాకారం సమగ్ర అభివృద్ధి కోసం రాష్ట్ర మంత్రి వర్గం రూ.226 కోట్ల ప్రాజెక్టును ఆమోదించింది. 69 ఎకరా విస్తీర్ణంలో అభివృద్ధి పనుల కోసం వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) ఇప్పటికే సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు.

రాష్ట్రంలోని అత్యంత ప్రముఖ పుణ్యక్షేత్రాలలో ఒకటైన భక్తులకు మౌలిక సదుపాయాలు, సౌకర్యాలను పెంచడం ఈ ప్రాజెక్ట్ లక్ష్యం. ఈ ప్రాజెక్టులో భాగంగా 246 మందికి సౌకర్యాలతో కూడిన యాత్రికుల సత్రము మరియు సామూహిక సమావేశాల కోసం 500 సీట్ల హాల్ నిర్మాణం తదితర ప్రణాళికలను మంత్రి మండలి నిర్ధారించింది.

- దుకాణాలు, వాణిజ్య సంస్థల చట్టం, 1956లో సంస్కరణలు..
- ఈ చట్టం 20, అంతకంటే ఎక్కువ మంది కార్మికులను నియమించే సంస్థలకు వర్తిస్తుంది.
- రోజువారీ పని గంటలు 9 నుంచి 10 గంటలకు పెంపుదల.
- నిర్విరామంగా పని షిఫ్టుల నిడివి 6 గంటలకు పొడిగింపు.
- త్రైమాసిక ఓవర్ టైమ్ పరిమితిని 50 నుంచి 144 గంటలకు విస్తరణ.
- రోజుకు 10 గంటలు, వారానికి 48 గంటలు మించి పనిచేసే ఉద్యోగులకు ఓవర్ టైమ్ కింద రెట్టింపు వేతనాలు మంజూరు.
- సవరించిన చట్టం అధీనంలో సంస్థలు నిత్యం రాత్రింబవళ్లు సంవత్సరంలో 365 రోజులు పని చేయడానికి అనుమతి.
- దుకాణాలు, వాణిజ్య సంస్థలు ఒడియాలో సైన్ బోర్డులు ఏర్పాటు చేయడం అనివార్యం.

పాత్రికేయునిపై తుపాకి దాడి



మనోజ్ నాయక్

భువనేశ్వర్: కటక్ జిల్లా బొడొంబా ప్రాంతంలో పాత్రికేయునిపై ఆగంతకులు తుపాకీ గురి పెట్టారు. ఈ దాడిలో అతని భుజం, వేళ్లకు బుల్లెట్ గాయాలయ్యాయి. నువాపడా గ్రామంలో ఆదివారం రాత్రి దుండగులు బాధితుని ఇంటిలోకి చొరబడి కాల్పులు జరిపారు. పోలీసులకు ఫిర్యాదు అందడంతో రంగంలోకి దిగి విచారణ చేపట్టారు. విచారణలో రిపోర్టర్ మనోజ్ నాయక్ బాధితునిగా గుర్తించారు. పాత కక్షలతో ఈ దాడి జరిగినట్లు ప్రాథమిక విచారణలో తేలినట్లు పేర్కొన్నారు. ఘటనా స్థలం నుంచి పిస్టల్ స్వాధీనం చేసుకుని నిందితుడిని బొడొంబా ఠాణా పోలీసులు అరెస్టు చేశారు.

ట్రాక్టర్ బోల్తా..

- 10 మందికి గాయాలు

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో మోహనా బ్లాక్ గరడమా పంచాయతీ నుంచి గంభారీ గ్రామానికి ట్రాక్టర్ ద్వారా రేషన్ బియ్యం తీసుకెళ్తుండగా.. డెప్పగుడ వద్ద బ్రేకులు ఫెయిల్ అవడంతో బోల్తా పడింది. ఈ దుర్ఘటనలో ట్రాక్టరులో ఉన్న కూలీలు, డ్రైవర్‌తో సహా పదిమందికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను బ్రాహ్మణిగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రాథమిక వైద్యం అందించారు. మెరుగైన చికిత్స నిమిత్తం మోహనా మెడికల్‌కు తరలించారు. మోహనా పోలీసులు దీనిపై ఒక కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాయామంతో గుండె చప్పుడు పదిలం: హైటెక్



ప్రపంచ గుండె దినం వాకథాన్‌లో పాల్గొన్న హైటెక్ వర్గీయులు



హైటెక్ వర్గీయుల వాకథాన్

భువనేశ్వర్:

క్రమబద్ధమైన వ్యాయామం ఆరోగ్యవంతమైన గుండెకు భద్రత కల్పిస్తుందని, ఈత, సైక్లింగ్, నడక వంటి సాధారణ అలవాట్లలతో గుండె చప్పుడు సురక్షితంగా ఉంటుందని హైటెక్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ తిరుపతి పాణిగ్రాహి తెలిపారు. ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా స్థానిక హైటెక్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ క్యాంపస్ నుంచి జీజీపీ కాలనీ వరకు సోమవారం వాకథాన్ నిర్వహించారు. హైటెక్ వర్గం కార్డియాలజీ విభాగం ప్రముఖుడు డాక్టర్ రితేష్ ఆచార్య, సీటీవీఏ నిపుణుడు డాక్టర్ శ్వేతా దాస్, సీఈఓ జ్యోతిర్మయ్ పండా, విద్యార్థులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. గుండెను ఆరోగ్యంగా ఉంచుకోవడానికి రోజుకు కనీసం 30 నిమిషాలు ఈత కొట్టడం, సైక్లింగ్ చేయడం, నడకకు ప్రాధాన్యత కల్పించడం గుండె నిరంతర చప్పుడుకు హామీపూర్వక ఆచరణగా వాకథాన్‌లో పాల్గొన్న హృద్రోగ వైద్య, చికిత్స నిపుణులు తెలిపారు. హైటెక్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ హైటెక్ గ్రూప్ మేనేజింగ్ ట్రస్టీ సురేష్ కుమార్ పాణిగ్రాహి మాట్లాడుతు సమతుల్య పోష్టిక ఆహారంతో దైనందిన శారీరిక వ్యాయామంతో ఆరోగ్యకరమైన జీవితాన్ని ఆస్వాదించాలని పిలుపునిచ్చారు.

శాంతియుతంగా దుర్గా పూజలు

- గవర్నర్ హరిబాబు కంభంపాటి
- దుర్గా పూజా మందిరం సందర్శన



జోబ్రా దుర్గామాత పూజా మండపం ఆవరణలో గవర్నర్ దంపతులకు స్వాగతం పలుకుతున్న స్థానిక ఎమ్మెల్యే తదితరులు



దుర్గా మాత పూజా మండపాన్ని ప్రారంభించిన రాష్ట్ర గవర్నర్ డాక్టరు హరిబాబు కంభంపాటి

భువనేశ్వర్: దుర్గాదేవి పూజోత్సవాలకు పేరొందిన కటక్ నగరంలో జోబ్రా ప్రాంతంలో రజత ప్రభ దేవీ పూజా మండపాన్ని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి ప్రారంభించారు. ఆయనతో ప్రథమ మహిళ జయశ్రీ కంభంపాటి పాల్గొని దుర్గా దేవికి అఖండ దీపారాధన చేశారు. కటక్ నగర వారసత్వ చేతిపనుల వెండి ప్రభల సంప్రదాయం ప్రపంచ ప్రఖ్యాతకు ప్రేరణగా గవర్నర్ ప్రశంసించారు. నగరంలో పూజాదులు శాంతియుతంగా, ఆనందంగా ముగియాలని గవర్నర్ దంపతులు నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేశారు. గవర్నర్ దంపతులకు పూజా నిర్వాహక కమిటీ సభ్యులు స్వాగతించారు. వారు మేధ ఏర్పాట్లు, కళాత్మకత గురించి వివరించారు. గవర్నర్, ప్రథమ మహిళకు బారాబటి ఎమ్మెల్యే సోఫియా ఫిరదౌస్, చౌద్వార్ నియోజకవర్గం ఎమ్మెల్యే సౌవిక్ బిస్వాల్, కటక్ నగర పాలక సంస్థ సీఎంసీ మేయర్ సుభాష్ చంద్ర సింగ్, జిల్లా యంత్రాంగం అధికారులు స్వాగతం పలికారు.

25 కేజీల గంజాయితో ఇద్దరు అరెస్టు

పలాస : పలాస రైల్వేస్టేషన్ మార్గంలో 25 కిలోల గంజాయిని తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్టు కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ సోమవారం విలేకరులకు వెల్లడించారు. ఒడిశాలో కొనుగోలు చేసిన 10 కిలోల గంజాయిని పలాస రైల్వేస్టేషన్ మీదుగా కోల్‌కతాకు రవాణా చేసేందుకు వెళ్తుండగా పర్లాకిమిడికి చెందిన సర్వశుద్ధి కుమార్ స్వామిని పోలీసులు పట్టుకున్నారు. నిందితుడి వద్ద నుంచి గంజాయి, సెల్‌ఫోను స్వాధీనం చేసుకున్నారు.

హార్డ్‌వేర్ షాపు దగ్ధం



కొత్తూరులో కాలిపోతున్న కమల హార్డ్‌వేర్ షాపు

- కొత్తూరులో వేకువజామున ఘటన
- సుమారు కోటి రూపాయల ఆస్తి నష్టం
- మూడు ఫైర్ ఇంజిన్లతో మంటలు అదుపు చేసిన సిబ్బంది

కొత్తూరు : కొత్తూరులోని బత్తిలి రోడ్డులో ఇరాజీ కిమారామ్‌కు చెందిన కమల హార్డ్‌వేర్ షాపులో ఆదివారం వేకువజామున అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో సుమారు కోటి రూపాయల ఆస్తి నష్టం వాటిల్లింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగిందని సమాచారం. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో సమీపంలోని కొత్తూరు అగ్ని ప్రమాక కేంద్రానికి సమాచారం అందించారు. ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ శంకరరావు సిబ్బందితో వచ్చి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అయితే ఇంజిన్ మోటార్ పనిచేయకపోవడంతో మంటలు అదుపులోకి రాలేదు. విషయాన్ని జిల్లా అగ్నిమాపక అధికారి జె.మోహన్‌రావుకు తెలియజేయడంతో వెంటనే పాలకొండ, ఆమదాలవలస అగ్నిమాపక కేంద్రాల ఫైర్ ఇంజిన్లు వచ్చాయి. సిబ్బంది తీవ్రంగా శ్రమించి మంటలు అదుపులోకి తీసుకొచ్చారు. హార్డ్‌వేర్‌షాపుతో పాటు పక్కనే ఆనుకుని ఉన్న చంద్రశేఖర్ మందులు షాపులోకి మంటలు చెలరేగడంతో అక్కడ కూడా సుమారు రూ.ఏడు లక్షల విలువైన మందులు పాడయ్యాయి. జిల్లా అగ్నిమాపక అధికారి ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు ఆరా తీశారు.

గంజాయి స్మగ్లింగ్‌పై ఉక్కుపాదం



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్. చిత్రంలో ఎస్పీ మహేశ్వర్‌రెడ్డి తదితరులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణా, విక్రయాలను పూర్తిగా అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. విద్యార్థులు, వర్కర్లు, డ్రైవర్లను లక్ష్యంగా చేసుకుని గంజాయి సరఫరా జరుగుతున్న నేపథ్యంలో గట్టి నిఘా అవసరమని స్పష్టం చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డితో కలిసి నార్కోటిక్ కో ఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని కళాశాలల్లో తక్షణమే ఈగల్ కమిటీలు ఏర్పాటు చేసి డ్రగ్స్‌పై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. డ్రగ్స్ రహిత సమాజంపై సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం జరగాలని సూచించారు. ఎస్పీ కె.వి.మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ గంజాయి అరికట్టడంలో కేసులు పెట్టడం మాత్రమే లక్ష్యం కాదని, ఒకే వ్యక్తి పదేపదే వాడుతున్నాడంటే నిఘా లోపం ఉన్నట్టేనని పేర్కొన్నారు. చిన్న సమాచారం ఉన్నా వెంటనే పోలీసులకు గానీ, 112 లేదా 1930 నంబర్లకు గానీ తెలియజేయాలని కోరారు. 2025 జులై–ఆగస్టు నెలల్లో 350.4 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని 77 మందిని అరెస్ట్ చేసి, 8 వాహనాలను సీజ్ చేసినట్టు వివరించారు. మహిళా భద్రతకు అమలు చేస్తున్న 'నారీ శక్తి' కార్యక్రమం సత్ఫలితాలు ఇస్తోందన్నారు. అనంతరం రహదారుల భద్రతపై సమీక్షించారు. జిల్లాలో ఈ ఏడాది ఇప్పటివరకు 524 రహదారి ప్రమాదాలు నమోదయ్యాయని ఎస్పీ వెల్లడించారు.

సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృథ్విరాజ్ కుమార్, పోలీస్, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, విద్యా, వైద్య ఆరోగ్యశాఖ, ఇంజనీరింగ్, రవాణా శాఖల అధికారులు హాజరయ్యారు.

క్లుప్తంగా

గంజాయితో ఐదుగురు నిందితుల అరెస్టు

బొండపల్లి: మండలంలోని గొట్లాం బైపాస్ రోడ్డు వద్ద మోటార్ సైకిల్‌పై అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకోగా వారి దగ్గర బయటపడిన రెండు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు ఎస్సై యు.మహేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాలూరు మండలంలోని సొంపిగాం గ్రామానికి చెందిన సీదరపు రామరావుతో పాటు అదే మండలంలోని సామంతులవలస గ్రామానికి చెందిన మల్లి నాగరాజు ద్విచక్ర వాహనంపై తిరుగుతుండగా అనుమానం వచ్చి అదుపులోకి తీసుకోగా వారి వద్ద విక్రయించడానికి సిద్ధంగా ఉన్న రెండు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే వారికి గంజాయి అమ్మకానికి సహకరించిన విజయనగరానికి చెందిన షేక్ మౌలాలి, వినుకొండల విజయ్ కుమార్, బారా సాయిలను కూడా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. వారి దగ్గర బైక్‌తో పాటు నాలుగు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

తండ్రి హత్య కేసులో తనయుడు

బొండపల్లి: ఈనెల 23 గురువారం రాత్రి మండలంలోని కొండకిండాం గ్రామంలో కిరాతకంగా ఇనుప రాడ్డుతో దాడి చేసి తండ్రిని హత్య చేసిన కేసులో నిందితుడైన తనయుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై యు.మహేష్ తెలిపారు. గ్రామానికి చెందిన పెద్ద మజ్జి నాయుడు బాబు, ఆయన ఏకైక కొడుకు గణేష్ కుమార్‌ల మధ్య ఆస్తి వివాదంలో ఘర్షణ జరగ్గా క్షణికావేశంలో తండ్రిపై ఇనుపరాడ్డుతో కొడుకు దాడి చేసి హత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతుని భార్య సత్యవతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు నిర్వహించి నిందితుడిని అరెస్టు చేసినట్లు చెప్పారు.

ముద్దాయికి మూడేళ్ల జైలుశిక్ష

గజపతినగరం: మెంటాడ మండలం పోరాం గ్రామరెవెన్యూ పరిధిలో ఓ మామిడి తోటలో ఉన్న వ్యక్తిపై దాడి చేసి చోరీకి పాల్పడి పరారైన ముద్దాయికి కోర్టు జైలు శిక్ష, జరిమానా విధించింది. ఈ కేసు వివరాలిలా ఉన్నాయి. తిరుమల రాజు జగన్నాథ రాజు అనే వ్యక్తి తలపై ఇటీవల వెదురుకర్రతో తీవ్రంగా కొట్టి రూ.10వేల నగదు, రెండు సెల్‌ఫోన్‌లు దొంగిలించి జె.భగవాన్ అనే నిందితుడు పరారయ్యాడు. ఈ కేసులో విచారణ అనంతరం ముద్దాయికి గజపతినగరం ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.విజయ్ రాజ్‌కుమార్ మూడేళ్ల జైలు శిక్ష రూ. వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు సోమవారం సాయంత్రం కోర్టు సిబ్బంది తెలిపారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని యువకుడి మృతి


పట్టాలపై మృతదేహం

బొబ్బిలి: స్థానిక రైల్వే స్టేషన్ యార్డు వద్ద గల రైల్వేలైన్‌పై రైలు ఢీకొని సుమారు 25–30 సంవత్సరాల మధ్య వయసు గల యువకుడు సోమవారం ఉదయం మృతిచెందినట్లు జీఆర్‌పీ హెచ్‌సీ బి.ఈశ్వరరావు తెలిపారు. మృతుడి శరీరంపై ఎరుపు గళ్ల చొక్కా, బ్రౌన్ కలర్ ప్యాంట్ ఉన్నాయని చెప్పారు. మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు గుర్తుపడితే ఫోన్ 8309901038, 9491813163 నంబర్లను సంప్రదించాలని కోరారు.

సూపర్ జీఎస్టీ, సేవింగ్స్ బ్రోచర్ విడుదల


సూపర్ జీఎస్టీ బ్రోచర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్, అధికారులు

పార్వతీపురం రూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఎస్టీ 2.0తో పేద, మధ్యతరగతి వర్గాలకు చేకూరిన లబ్ధిని తెలియజేసే సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ బ్రోచర్‌ను, కరపత్రాన్ని కలెక్టర్ డా.ఎస్.ప్రభాకర రెడ్డి సోమవారం విడుదల చేశారు. ప్రజలకు కలిగే లబ్ధిని క్షుణ్ణంగా వివరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జేసీ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి, డీఆర్వో హేమలత, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సీజ్ చేసిన వాహనాలు అప్పగించండి

- ఎస్పీ దామోదర్

విజయనగరం క్రైమ్: జిల్లాలో పలు కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను నిబంధనల మేరకు అప్పగించాలని ఎస్పీదామోదర్ పోలీస్ అధికారులను ఆదేశించారు. చీపురుపల్లి పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని గజపతినగరం పోలీస్ స్టేషన్‌ను సోమవారం తనిఖీచేశారు. స్టేషన్ ప్రాంగణంలోని వాహనాలను పరిశీలించారు. స్టేషన్ పరిధిలో మరిన్ని ఎక్కువ సీసీ కెమెరాలను అమర్చాలని, గస్తీ, పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయాలని, నేరాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని స్టేషన్ సిబ్బందిని ఆదేశించారు. గంజాయి రవాణా, విక్రయించేవారు, మహిళల పట్ల దాడులకు, బాలలపై అఘాయిత్యాలకు పాల్పడే వారిపట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు. ఆయన వెంట అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఏఆర్ అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు, చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు, గజపతినగరం సీఐ జి.ఎ.వి.రమణ, ఎస్ఐ కె.కిరణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

సమస్యలకు సత్వర పరిష్కారమే లక్ష్యం

- కలెక్టర్ డా.ఎస్.ప్రభాకర్ రెడ్డి


అర్జీదారుల సమస్యను వింటున్న కలెక్టర్ డా.ఎస్.ప్రభాకర్ రెడ్డి


ఫిర్యాదులను తెలుసుకుంటున్న ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి


సీతంపేట: వినతులు స్వీకరిస్తున్న ఏపీఓ చిన్నబాబు

పార్వతీపురం రూరల్: ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ డా.ఎస్.ప్రభాకర్ రెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆయన అధ్యక్షతన రెవెన్యూ, సంక్షేమం , అభివృద్ధి రెండు విభాగాలుగా ఏర్పడి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి 102 వినతులను కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, సబ్‌కలెక్టర్ ఆర్.వైశాలి, పాలకొండ సబ్‌కలెక్టర్ పవర్ స్వప్నిల్ జగన్నాథ్, డీఆర్‌ఓ కె. హేమలత, ఎస్‌డీసీలు పి. ధర్మచంద్రారెడ్డి, ఎస్.దిలీప్ చక్రవర్తి, డీఆర్‌డీఏ, డ్వామా పీడీలు ఎం.సుధారాణీ , కె.రామచంద్రరావులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శాఖాధికారులు వారికి నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆదేశించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా అధికారులను ఏర్పాటు చేస్తూ సమస్యలను సంపూర్ణంగా విన్నవించుకునే విధంగా అర్జీదారులకు అవకాశం కల్పించామని తెలిపారు. అలాగే ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పలు శాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రజల పిటిషన్లకు పరిష్కారం

ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించి పిటిషన్లకు పరిష్కారం చూపిస్తూ, వచ్చిన ఫిర్యాదులను చట్టపరిధిలో పరిష్కరించాలని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి సంబంధిత పోలీసు శాఖాధికారులకు స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలో ఉన్న పలు స్టేషన్ల పరిధుల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి 5 పిటిషన్లు స్వీకరించి, అర్జీదారులతో ఎస్పీ ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఫిర్యాదుదారులు స్వేచ్ఛగా విన్నవించగా వారి సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఎస్పీ ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదు అంశాలను పరిశీలించి, వాటి పూర్వాపరాలను విచారణ చేసి, ఫిర్యాదు అంశాలు వాస్తవాలైనట్లయితే చట్ట పరిధిలో తక్షణ చర్యలు చేపట్టాలని, తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీసీఆర్బీ సీఐ ఆదాం, సీసీఎస్ సీఐ అప్పారావు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ఐటీడీఏ పీజీఆర్ఎస్‌కు 23 వినతులు

సీతంపేట: స్థానిక ఐటీడీఏలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 23 వినతులు వచ్చాయి. ఏపీఓ జి.చిన్నబాబు అర్జీలు స్వీకరించారు. తాడిపాయికి చెందిన నందిని భాషా వలంటీర్ పోస్టు ఇప్పించాలని కోరారు. పాతూరుకు చెందిన ఢిల్లేశ్వరరావు ఏదైనా ఆశ్రమపాఠశాలలో కుక్, కమాటి పోస్టులో నియమించాలని విజ్ఞప్తి చేశాడు. కొత్తకోటలో ఉన్న అంగన్‌వాడీ భవనం శిథిలావస్థలో ఉన్నందున కొత్త భవనం మంజూరు చేయాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. మినీగురుకులానికి మౌలికవసతులు కల్పించాలని కె.వీరఘట్టానికి చెందిన బి.నీలకంఠం అర్జీ అందజేశాడు. అచ్యుతాపురానికి చెందిన బి.సుశీల వాటర్‌ప్లాంట్ మంజూరు చేయాలని కోరింది. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్ ఈఈ రమాదేవి, డిప్యూటీఈఓ రామ్మోహన్‌రావు, స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ జాకాబ్ దయానందం తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం

- ఓఎన్జీజీసీ క్రీడా స్కాలర్ షిప్‌ను సద్వినియోగం చేసుకోవాలి
- అక్టోబర్ 21లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కె. శ్రీధరరావు

పార్వతీపురంటౌన్: ఓఎన్జీసీ క్రీడా స్కాలర్ షిప్ పథకం కింద 2025–26 సంవత్సరానికి గాను వెనుకబడిన ప్రతిభావంతులైన క్రీడాకారులకు స్కాలర్ షిప్‌లు అందిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కె.శ్రీధరరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 21 క్రీడా విభాగాల్లో సబ్–జూనియర్, జూనియర్, సీనియర్ పురుషులు, మహిళా క్రీడాకారులకు నెలకు రూ.15,000 నుంచి రూ.30,000 వరకు క్రీడా స్కాలర్ షిప్ లను 250 మందికి అందించనున్నారన్నారు. ఈ స్కాలర్ షిప్‌కు దరఖాస్తు చేసేందుకు 15 నుంచి 20 సంవత్సరాల మధ్య వయస్సు ఉండి, తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.5 లక్షల లోపు గల వారు దిగువ తెలిపిన క్రీడాంశాల్లో వెనుకబడిన ప్రతిభావంతులైన క్రీడాకారులు అర్హులన్నారు.

క్రీడాంశాల వివరాలు

అథ్లెటిక్స్ జూనియర్–సీనియర్ స్థాయి 20 సం.ల లోపు, బాడ్మింటన్ జూనియర్–సీనియర్ స్థాయి 19సం.పైబడి, బాస్కెట్ బాల్ జూనియర్–సీనియర్ స్థాయి 18సం.పైబడి, చెస్ జూనియర్–సీనియర్ స్థాయి 19 సం.ల పైబడి, క్రికెట్ జూనియర్ స్థాయి 19 సం.ల లోపు, ఫుట్ బాల్ జూనియర్ స్థాయి 19 సం.ల లోపు, హాకీ జూనియర్ స్థాయి 21 సం.ల లోపు, కబడ్డీ జూనియర్ స్థాయి 20 సం.ల లోపు, స్క్వాష్ జూనియర్ స్థాయి 19 సం.ల లోపు, టేబుల్ టెన్నిస్ జూనియర్ – సీనియర్ స్థాయి 19 సం.ల లోపు, టెన్నిస్ జూనియర్, సీనియర్ స్థాయి 18 సం.ల లోపు, వాలీబాల్ జూనియర్ స్థాయి 21 సం.ల లోపు, స్విమ్మింగ్ జూనియర్–సీనియర్ స్థాయి 17 సం.ల లోపు, ఆర్చరీ జూనియర్ – సీనియర్ స్థాయి 18 సం.ల లోపు, బాక్సింగ్ జూనియర్, సీనియర్ స్థాయి 18 సం.ల లోపు జిమ్నాస్టిక్స్ జూనియర్–సీనియర్ స్థాయి 16 సం.ల లోపు, పారా స్పోర్ట్స్, షూటింగ్ సబ్–జూనియర్–జూనియర్ స్థాయి 18 సం.ల లోపు, రెజ్లింగ్ సబ్–జూనియర్ స్థాయి 17 సం.ల లోపు, జూనియర్ స్థాయి 20 సం.ల లోపు, కేరమ్స్ సబ్–జూనియర్–జూనియర్ స్థాయి 18 సం.ల లోపు, ఖోఖో జూనియర్–సీనియర్ స్థాయి 18 సం.ల లోపు ఉండాలి. ఆసక్తి గల క్రీడాకారులు ఓఎన్జీసీ అధికారిక వెబ్‌సైట్ http://sportsschoarship.ongc.co.in లో అక్టోబర్ 21వ తేదీ సాయంత్రం 4 గంటల లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేయడానికి ముందు పోర్టల్‌లో ఇచ్చిన పథకం వివరాలతో పాటు నిబంధనలు, షరతులను గ్రహించాలని సూచించారు.

హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలి

- 1998 ఎంటీఎస్ ఐపాధ్యాయ సంఘం పిలుపు


మాట్లాడుతున్న ఎంటీఎస్ సంఘం నాయకుడు ఉమాకామేశ్వరరావు

పార్వతీపురం: ఎంటీఎస్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని ఉమ్మడి విజయనగరం జిల్లా ఎంటీఎస్ ఉపాధ్యాయ సంఘ నాయకుడు ఉమా కామేశ్వర రావు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం పార్వతీపురంలోని చర్చివీధిలో గల వేదాంత జూనియర్ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 25 ఏళ్ల సుదీర్ఘ పోరాటం ఫలితంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు 98 డీఎస్సీ ఉపాధ్యాయ అభ్యర్థుల్లో వెలుగు నింపి ఉపాధ్యాయులుగా నియమించారన్నారు. ఎంటీఎస్ టీచర్లను రెగ్యులర్ చేయాలని, 12 నెలల జీతాన్ని ఇవ్వాలని ప్రస్తుత ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. న్యాయమైన హక్కుల సాధనకు, న్యాయపోరాటానికి ప్రతి ఒక్కరూ సిద్ధం కావాలని కోరారు. 98 ఎంటీఎస్ సమస్యల పరిష్కారం కోసం, ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు అక్టోబర్ 11న విజయవాడలో నిర్వహిస్తున్న విజ్ఞాపన సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్వతీపురం మన్యం జిల్లా నాయకులు పీవీ రామ మోహనరావు, కె.రమేష్, దామోదరరావు, పూడు శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం

- స్వామివారికి టీటీడీ నుంచి పట్టువస్త్రాల సమర్పణ


శ్రీలక్ష్మీ సమేత వేంకటేశ్వరస్వామిని రామతీర్థం తిరువీధుల్లో ఊరేగిస్తున్న అర్చకులు


వెండి మంటపం వద్ద స్వామి కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకులు


స్వామివారికి తిరుముల తిరుపతి దేవస్థానం నుంచి తెచ్చిన పట్టువస్త్రాలను సమర్పిస్తున్న దృశ్యం

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీవారి కల్యాణం సోమవారం వైభవంగా జరిగింది. వేకువజామున ఆలయంలో ప్రాతఃకాల పూజలనంతరం యాగశాలలో అర్చకులు విశేష హోమాలు జరిపించారు. శ్రీ వేంకటేశ్వరస్వామిని నూతన పట్టు వస్త్రాలతో సుందరంగా అలంకరించి మంగళవాయిద్యాల నడుమ రామతీర్థం తిరు వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం రామాలయంలోని వెండి మంటపం వద్ద లక్ష్మీ సమేత వేంకటేశ్వరస్వామిని తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి తెచ్చిన పట్టువస్త్రాలతో సుందరంగా అలంకరించి కల్యాణ వేడుకను కనులపండువగా జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు సాయిరామాచార్యులు, నరసింహాచార్యులు, కిరణ్‌కుమార్, రామగోపాలాచార్యులు, నగర పంచాయతీ వైస్‌చైర్మన్ సముద్రపు రామారావు, తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ విజేత విజయనగరం


బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్సీ రామారావు

సోంపేట: శ్రీకాకుళం జిల్లా లక్కవరం గ్రామంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన అంతర్‌జిల్లాల క్విజ్ పోటీల్లో విజయనగరం జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. ద్వితీయ స్థానంలో గోకర్ణపురం, తృతీయ స్థానంలో బి.కేశుపురం నిలిచాయి. విజేతలకు ఎమ్మెల్సీ నర్తు రామారావు సోమవారం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వేణుగోపాలరావు, నారాయణరావు, హేమసుందర్, వజ్జకృష్ణ పాల్గొన్నారు.

హెచ్ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన కల్పించాలి


విజేతకు బహుమతి అందజేస్తున్న డీఎంహెచ్‌ఓ జీవనరాణి

విజయనగరంఫోర్ట్: హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై ప్రజల్లో అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.జీవనరాణి తెలిపారు. ఈ మేరకు స్థానిక జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఇటీవల నిర్వహించిన రెడ్‌రన్ మారథాన్ 5కెలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెచ్ఐవీ రోగుల పట్ల వివక్ష చూపరాదన్నారు. వారి పట్ల ప్రేమ అప్యాయత చూపించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎల్‌ఓ డాక్టర్ కె.రాణి పాల్గొన్నారు.

దసరా సంత


కిటకిటలాడిన దసరా సంత

సీతంపేటలో సోమవారం జరిగిన వారపు సంత క్రయవిక్రయదారులతో కిక్కిరిసింది. దసరా ముందురోజు సంతకావడంతో పొట్టేళ్లు, నాటు కోళ్ల క్రయవిక్రయాలు జోరుగా సాగాయి. కిలో పైబడి ఉన్న నాటుకోడి పుంజు రూ.1500లు ధర పలికింది. మేక, గొర్రె పోతులు రూ.20వేలు పైబడి ధరకు విక్రయించారు.

పైడితల్లి హుండీల ఆదాయం లెక్కింపు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి చదురుగుడిలోని హుండీల ఆదాయాన్ని అమ్మవారి కల్యాణ మండపం ఆవరణలో సోమవారం లెక్కించారు. రూ.16,75,917ల నగదు, 14.100 మిల్లీ గ్రాముల బంగారం, 301 గ్రాముల వెండి, అన్నదాన హుండీ నుంచి రూ.800లు లభించినట్టు ఆలయ ఇన్‌చార్జి ఈఓ కె.శిరీష తెలిపారు. కార్యక్రమంలో శంబర పోలమాంబ ఈఓ శ్రీనివాస్, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు 20 మంది ఎంపిక


రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు, పీడీలు

బొబ్బిలి రూరల్: రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు 20 మందితో జట్టును ఎంపిక చేసినట్లు సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి విజయకుమార్ తెలియజేశారు. ఈ మేరకు బొబ్బిలి మండలంలోని పారాది జెడ్పీహెచ్ పాఠశాలల సోమవారం జరిగిన జిల్లా సీనియర్ మెన్ సాఫ్ట్‌బాల్ క్రీడాకారుల ఎంపికను పీడీ సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించామని 60 మంది పాల్గొనగా ఉత్తమ ప్రతిభను కనబర్చిన 20 మంది క్రీడాకారులను ఎంపిక చేశామని వారిని సత్తెనపల్లిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నామని తెలిపారు.

కుళాయిల ద్వారా బురదనీరు

- మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ప్రస్తావించిన సభ్యులు


సమావేశంలో పాల్గొన్న సభ్యులు

నెల్లిమర్ల:

నగర పంచాయతీ పరిధిలోని 5, 6, 7 వార్డులకు కుళాయిల ద్వారా బురదనీరు సరఫరా అవుతోందని, సమస్య పరిష్కరించాలని కౌన్సిలర్ మైపాడ ప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో చైర్‌పర్సన్ బంగారు సరోజిని ఆధ్వర్యంలో కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ప్రస్తావించారు. ప్రధాన రహదారిలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్స్ వద్ద స్విచ్‌లు సక్రమంగా పనిచేయడం లేదని, దీంతో ప్రమాదం పొంచి ఉందని కౌన్సిలర్ లెంక హైమావతి సభ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే ప్రధాన మురుగునీటి కాలువల్లో పూడికలు తొలగించాలని ముడిమంచి లక్ష్మి కోరారు. మున్సిపల్ సిబ్బందిలో కొంతమంది విధులు సక్రమంగా నిర్వహించడం లేదని పలువురు సభ్యులు ప్రస్తావించారు. నగర పంచాయతీలో నిర్వహించే అధికారిక కార్యక్రమాల్లో కౌన్సిలర్లకు ప్రొటోకాల్ పరంగా ప్రాధాన్యత ఇవ్వాలని మొయిద శ్రీనివాసవాసరావు అన్నారు. కమిషనర్ జయరామ్ మాట్లాడుతూ.. సభ్యులు ప్రస్తావించిన సమస్యలను పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఓపెన్ జిమ్ పరికరాలు గాంధీనగర్ కాలనీలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్‌పర్సన్ సముద్రపు రామారావు, కౌన్సిలర్లు, జనా సంధ్యారాణి, అధికారులు పాల్గొన్నారు.

సీఎం రాక ఏర్పాట్ల పరిశీలన


కార్యకర్తలతో నిర్వహించే సభా ప్రాంగణం వద్ద చర్చిస్తున్న కలెక్టర్, ఎస్పీ

దత్తిరాజేరు: దత్తి గ్రామానికి ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం వస్తున్న సందర్భంగా గ్రామంలో జరుగుతున్న ఏర్పాట్లను కలెక్టర్ ఎస్.రామ్ సుందర్‌రెడ్డి, ఎస్పీ ఏఆర్ దామోదర్ సోమవారం పరిశీలించారు. ముఖ్యమంత్రి పింఛన్లు పంపిణీ చేసే ఇళ్లకు వెళ్లే మార్గాలను, వాహనాల పార్కింగ్, కూటమి నాయకులతో సమావేశం కానున్న హాల్‌ను పరిశీలించారు. హెలిప్యాడ్ వద్దకు ఇతరులు రాకుండా కంచెను కట్టుదిట్టంగా వేయాలని, గ్రామస్తులకు ఎలాంటి ఇబ్బందులు పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని మంత్రులు, ఎమ్మెల్యేలు ఇతర ప్రజాప్రతినిధుల రాకపోకలకు అనువుగా అన్ని ఏర్పాట్లు ఉండాలని పోలీస్, ఇతర శాఖల అధికారులను ఆదేశించారు.

పీజీఆర్ఎస్‌పై సీఎం పర్యటన ఏర్పాట్ల ప్రభావం

- కలెక్టర్, జేసీ లేకపోవడంతో తగ్గిన వినతులు
- డీఆర్‌ఓ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహణ


ఫిర్యాదు దారుల సమస్యలను పరిశీలిస్తున్న డీఎస్పీ గోవిందరావు


అర్జీలను స్వీకరిస్తున్న డీఆర్‌ఓ శ్రీనివాసమూర్తి

విజయనగరం అర్బన్: కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక పీజీఆర్ఎస్ కార్యక్రమంపై సీఎం జిల్లా పర్యటన ఏర్పాట్ల ప్రభావం పడింది. వినతుల స్వీకరణ కార్యక్రమంలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లు లేకపోవడంతో సమస్యలు చెప్పుకోవడానికి వచ్చిన పలువురు ప్రజలు వెనుదిరిగారు. వినతులు ఇవ్వకుండా వెనుతిరిగిన అర్జీదారుల్లో ఎస్.కోట, విజయనగరం మండలాల నుంచి వచ్చిన రైతులు ఉన్నారు. పీజీఆర్ఎస్‌కు ప్రతి సోమవారం 200కు పైగా వచ్చే అర్జీలు ఈ వారం 134 మాత్రమే నమోదయ్యాయి. డీఆర్‌ఓ ఎస్.శ్రీనివాసమూర్తి అధ్వర్యంలో నిర్వహించిన వినతుల స్వీకరణ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వెంకటేశ్వరావు, మురళి, సూకరాజు ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. వాటిని పరిశీలించి, పరిష్కారం కోసం ఆయా శాఖలకు పంపించారు.

ఎస్పీ గ్రీవెన్స్ సెల్‌కు 30 ఫిర్యాదులు

విజయనగరం క్రైమ్: ఎస్పీ ఆదేశాలతో విజయనగరం డీఎస్పీ గోవిందరావు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను పరేడ్ మైదానం వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 30 మంది ఫిర్యాదుదారులు తమ సమస్యలను డీఎస్పీకి విన్నవించారు.

రీఅసెస్‌మెంట్ పూర్తయినా అందని టీఏడీఏలు..!

- దివ్యాంగులకు సదరం రీ అసెస్‌మెంట్ చేసిన వైద్యులు
- జిల్లాలో ఈఏడాది జనవరి నుంచి ప్రారంభమైన ప్రక్రియ
- 30 వేలకు పైగా దివ్యాంగులకు పరీక్షలు చేసి రీఅసెస్‌మెంట్
- వైద్యులకు టీఏ, డీఏల బకాయి


రీ అసెస్‌మెంట్‌కు వచ్చిన దివ్యాంగులు (ఫైల్)

విజయనగరం ఫోర్ట్: దివ్యాంగులకు పింఛన్ వెరిఫికేషన్ పేరిట కూటమి సర్కార్ తీసుకొచ్చిన సదరం సర్టిఫికెట్‌ల రీవెరిఫికేషన్ నిర్వహించిన వైద్యులకు చెల్లించాల్సిన టీఏ, డీఏలు ఇవ్వకుండా కూటమి సర్కార్ జాప్యం చేస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రీ అసెస్‌మెంట్ జరిగి నెలలు గడుస్తున్నా ఇంతవరకు టీఏ, డీఏలు చెల్లించకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. సొంత డబ్బులు పెట్టుకుని వైద్యులు వివిధ ప్రాంతాల నుంచి రీ అసెస్‌మెంట్ చేయడానికి ఆస్పత్రులకు వచ్చారు. రీ అసెస్ మెంట్ చేసినందుకు గాను వారికి చెల్లించాల్సిన టీఏ, డీఏలకు సంబంధించి డబ్బులు మాత్రం చెల్లించకుండా కూటమి సర్కార్ జాప్యం చేయడం పట్ల వైద్యులు ఆవేదన చెందుతున్నారు.

రీ అసెస్‌మెంట్ నిర్వహించిన ఆస్పత్రులు

జిల్లాలో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, చీపురుపల్లి, గజపతినగరం, ఎస్.కోట, రాజాం, సాలూరు ఏరియా ఆస్పత్రులు, పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో దివ్యాంగులకు రీ అసెస్‌మెంట్ నిర్వహించారు.

రీఅసెస్ మెంట్‌లో 40 నుంచి 50 మంది వైద్యులు

2025 జనవరిలో కూటమి ప్రభుత్వం జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా దివ్యాంగ పింఛన్లు పొందుతున్న దివ్యాంగులకు రీఅసెస్‌మెంట్ కార్యక్రమాన్ని చేపట్టింది. జనవరి నెలలో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. వారంలో మూడు రోజుల పాటు దివ్యాంగులకు రీ అసెస్ మెంట్ చేసేవారు. బుధ, గురు, శుక్రవారాల్లో ఆయా ఆస్పత్రుల్లో వైద్యులు రీ అసెస్‌మెంట్ నిర్వహించారు.

30వేల మందికి పైగా దివ్యాంగులకు పరీక్షలు

జిల్లాలో వేలాది మంది దివ్యాంగులకు వైద్యులు రీఅసెస్‌మెంట్ చేశారు. దివ్యాంగులకు అవసరమైన పరీక్షలు నిర్వహించి రీ అసెస్‌మెంట్ సర్టిఫికెట్స్ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. కంటి, ఎముకలు, ఈఎన్‌టీ, మానసిక, న్యూరో విభాగాలకు సంబంధించి 30 వేలమందికి పైగా దివ్యాంగులకు వైద్యులు రీ అసెస్‌మెంట్ నిర్వహించారు.

దూర ప్రాంతాల నుంచి వైద్యుల రాక

జిల్లాలో దివ్యాంగులకు రీ అసెస్‌మెంట్ నిర్వహించేందుకు వివిధ విభాగాలకు చెందిన వైద్యులు విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల నుంచి వచ్చేవారు.

త్వరలో చెల్లిస్తాం

దివ్యాంగులకు రీ అసెస్‌మెంట్ నిర్వహించడానికి వచ్చిన వైద్యులకు టీఏ, డీఏలు చెల్లించాల్సి ఉంది. నిధులు వచ్చాయి. త్వరలోనే చెల్లిస్తాం.

– డాక్టర్ పద్మశ్రీ రాణి,
జిల్లా ఆస్పత్రుల సేవల సమన్వయాధికారి